తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
మంగళవారం
09 జూన్ 2026
పేజీలు : 8



Follow :

# నిషేధిత మత్తు పదార్థాలపై నిరంతరం నిఘా

## ○గంజాయి నిరోధానికి ఆకస్మిక తనిఖీలు
## ○గంజాయి మత్తుపదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు
## ○సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్



**కొండమల్లేపల్లి, జూన్ 8 (జనంసాక్షి):** గంజాయి ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. కొండమల్లేపల్లి పట్టణ వ్యాప్తంగా సోమవారం ఆకస్మిక తనిఖీలలో భాగంగా బహిరంగ ప్రదేశాలు లాడ్జిలు, పార్సిల్ సర్వీసులు, బస్ స్టాండ్లు, కిరాణా షాప్స్, పాన్ షాపుల్లో సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్ ల ఆధ్వర్యంలో నల్గొండ ప్రత్యేక యాంటీడ్రగ్స్ డాగ్ స్క్వాడ్ టీం ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్స్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రత్యేక బృందాలు ఈ దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి, గుట్కా, డ్రగ్స్ అలవాట్లకు యువత బానిస కాకుండా వివిధ గ్రామాల్లో, పాఠశాలలు, కళాశాలల్లో ఇదివరకే పూర్తిగా అవగాహన కల్పించమన్నారు. గంజాయి లేదా ఇతర డ్రగ్స్ సరఫరా జరుగుతోందన్న సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలో దొంగతనాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలకు యువత దూరం చేయాలనే లక్ష్యంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కొండమల్లేపల్లి పట్టణ వ్యాప్తంగా నిరంతర గస్తీలు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గంజాయి వినియోగదారులు, విక్రయదారులు, సరఫరాదారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని అన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 1908,100కి సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీలలో యాంటీడ్రగ్స్ టీం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మృగశిర కార్తీ సందడి.. చేపలకు ఫుల్ గిరాకీ

**భూదాన్ పోచంపల్లి, జూన్ 8 (జనంసాక్షి):** మృగశిర కార్తీ సందర్భంగా మండల వ్యాప్తంగా చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మృగశిర కార్తీ రోజు చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదనే నమ్మకంతో ప్రజలు ఉదయం నుంచే చేపల మార్కెట్లకు భారీగా తరలివచ్చారు. కొర్రమీను, రవ్వ తదితర చేపల రకాలకు అధిక డిమాండ్ ఏర్పడటంతో విక్రయాలు జోరుగా సాగాయి. మార్కెట్‌లలో చేపల కొనుగోలుదారుల రద్దీ పెరగడంతో విక్రయ కేంద్రాలన్నీ సందడిగా మారాయి. ధరలు కొంత పెరిగినా, మృగశిర కార్తీ ఆచారాన్ని పాటిస్తూ ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ప్రజలు చేపలను కొనుగోలు చేయడంలో ప్రత్యేక ఆసక్తి చూపించారు. వ్యాపారులు కూడా ఈ సందర్భంగా మంచి అమ్మకాలు జరిగాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# స్కూటీని ఢీకొన్న లారీ

## - యువతికి తీవ్రగాయాలు

**బూర్గంపహాడ్ జూన్ 08 (జనంసాక్షి)**
- స్కూటీని లారీ ఢీకొనగా ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని మర్రికుంట సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాల్వంచ మండలం కొత్త సూరారం గ్రామానికి చెందిన శ్రీవల్లి, వైష్ణవి లు శని, ఆదివారాలు సెలవులు ఉండటంతో వేపలగడ్డలో తమ బంధువుల ఇంటికి వచ్చారు. అయితే సోమవారం తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా వేపలగడ్డ నుంచి మర్రికుంట వద్ద ఉన్న ప్రధాన రహదారిపైకి వస్తున్న క్రమంలో మోరంపల్లిబంజర్ వైపు నుంచి లక్ష్మీపురం వైపు జామాయిల్ కర్రలోడుతో వస్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో వాహనం నడుపుతున్న శ్రీవల్లి, వైష్ణవి లు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో శ్రీవల్లి తల, శరీరభాగాలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు మోరంపల్లిబంజర్ ప్రాథమిక ఆరోగ్య ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించి చికిత్స చేయించారు. అనంతరం 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీవల్లి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్కు తరలించారు.






# సింగరేణి యాజమాన్య ఆటలు సాగవు..

## సమరానికి సై అంటున్న ఏఐటీయూసీ

**కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం జనంసాక్షి :**
సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్నా గాని వివక్షత చూపుతున్న యాజమాన్య ఆటలు ఇక సాగవ్ –ఇక ఉపేక్షించేది లేదు, పోరాటానికి సిద్ధం,,, హెచ్చరించిన సెంట్రల్ కౌన్సిల్, ఏఐటీయూసీ.యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్ సమావేశం విజయవంతం.హెడ్ ఆఫీస్ ముందు కామ్రేడ్ మానుబోతుల కొమురయ్య కాంస్య విగ్రహ పునఃప్రారంభోత్సవం ఘనంగా నిర్వహణ.కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఏఐటీయూసీ కేంద్ర కౌన్సిల్ సమావేశం రెండో రోజు ఘనంగా నిర్వహించబడింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం శాసనసభ్యులు, ఎఐటియుసి గౌరధ్యక్షులు కూనంనేని సాంబశివరావు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.నాయకులు తమ ప్రసంగాలలో సింగరేణిలో ప్రస్తుతం చోటుచేసు కుంటున్న పరిణామాలను ప్రస్తావిస్తూ, యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు భంగం కలిగించే చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని



డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటీవల గోలేటి నుండి కొత్తగూడెం వరకు నిర్వహించిన సింగరేణి జాత విజయవంతం కావడంలో సహకరించిన ప్రతి నాయకుడు, కార్యకర్త, కార్మికునికి హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు**
సమావేశంలో సింగరేణి కార్మికులకు సంబంధించిన పలు కీలక సమస్యలపై విస్తృతంగా చర్చించి, ఈ క్రింది డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం నుండి సింగరేణికి రావలసిన రూ.56 వేల కోట్ల బకాయిల విడుదల,అదేవిధంగా కొత్త గనుల ప్రారంభం,మెడికల్ బోర్డు నిర్వహణ, 2025–2026 లాభాల వాటాల్లో 40 % వాటా చెల్లించాలి,మారుపేర్లు ? విజిలెన్స్ కేసుల పరిష్కారం,సొంత ఇంటి పథకం అమలు,పెర్క్స్‌పై ఆదాయపు పన్ను భారం యాజమాన్యమే భరించడం, క్లర్క్ పోస్టుల భర్తీ, మరియు ఇతర పెండింగ్లో ఉన్న డిపార్ట్మెంట్ల పోస్టుల వెంటనే భర్తీ చేయాలి,400 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిస్మిస్ అయిన కార్మికులకు ఒకసారి అవకాశం ఇవ్వాలని,సహజ మరణం పొందిన కార్మిక కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఓవర్మెన్లు ప్రమోషన్లు ప్రమోషన్లు,
మరియు దాదాపు 30 డిమాండ్ల సాధన కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సోమవారం సాయంత్రం సింగరేణి యాజమాన్యానికి అధికారికంగా సమ్మె నోటీసు అందజేసిందని నాయకులు ప్రకటించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జనంసాక్షి

## ఐ టి డి ఏ వారు ఏర్పాటు చేసిన రోడ్డు ను ఆక్రమించి రోడ్డుపైనే ఫెన్సింగ్ వేసిన భూస్వామి

❍ప్రధాన రహదారిని కాపాడాలని మూడు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో విజ్ఞప్తి


❍ఈ రహదారి ఆక్రమణకు గురవుతున్న పట్టించుకోని ఐటిడిఏ ఇంజనీరింగ్ అధికారులు

❍జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని రహదారిని ఆక్రమించిన వారి నుండి కాపాడాలని ప్రజలు వేడుకొన్నారు

**కామేపల్లి జూన్ 8 (జనంసాక్షి):-** కామేపల్లి రహదారులను కాపాడాల్సిన అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారు. తమ గ్రామాలకు చెందిన ప్రధాన రహదారిని భూస్వామి ఆక్రమించుకొని రోడ్డుపైన ఫెన్సింగ్ వేశారని ప్రజలు అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోతుంది. భూస్వామి ఇచ్చే అమ్మమ్యాలకు ఆశపడి ఆ అధికారులు భూస్వామికి సపోర్ట్ చేయడంతో ఆ భూస్వామి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. పండితాపురం నుండి రాయిగూడెం,వయ్యా బండిపాడు ఎక్స్ రోడ్డు మీదుగా రుక్కితండా గ్రామం వరకు సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రహదారిని ఐటిడిఏ నిధులతో ఆశాఖ ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ ఆ నిర్మాణాన్ని ది 27-7-2019 వ తేదీన ప్రారంభించారు. ఇంతవరకు అంతా బాగానే ఉంది. కానీ అంతకుముందు గోవింద్రాల గ్రామానికి చెందిన భూస్వామి ఈ ప్రధాన రహదారి పక్కనే ఉన్న



వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. తన భూమికి రోడ్డు అడ్డుగా ఉందని భావించిన ఆయన తన హద్దులు చెరిపేసి రోడ్డును ఆక్రమించి ఫెన్సింగ్ నిర్మించారు. దీంతో ఫెన్సింగ్ వల్ల ప్రధాన రహదారి ఇరుకుగా మారి ఈ మూడు గ్రామాల ప్రజల రాకపోకలకు అడ్డుగా మారింది. అసలే వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుండటంతో రైతులు,ప్రజలు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్న ఐటిడిఏ ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం



పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఇక్కడ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఆందోళన చేయడానికి సిద్ధమవుతామని ఇక్కడ ప్రజలు హెచ్చరిస్తున్నారు. దీనిపై ఐటిడిఏ ఏఈ మహేందర్ ను వివరణ కోరగా రహదారి తమ పరిధిలో లేదని తహసిల్దార్ కు ప్రజలు ఫిర్యాదు చేయాలని లేదా పై అధికారులకు చెప్పాలని అన్నారు.

## సింగరేణి యాజమాన్య ఆటలు సాగవు

### సమరానికి సై అంటున్న ఏఐటీయూసీ

సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం మరియు ఉద్యోగ భద్రత పరిరక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కామ్రేడ్ మానుబోతుల కొమురయ్య కాంస్య విగ్రహ పునఃప్రారంభోత్సవం,అనంతరం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన మానుబోతుల కొమురయ్య కాంస్య విగ్రహ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ,ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, పునఃప్రారంభోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కొమురయ్య గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సింగరేణి కార్మిక ఉద్యమాల అభ్యున్నతికి, కార్మిక హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. కొమురయ్య పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని కార్మిక సమస్యల పరిష్కారం కోసం మరింత బలంగా ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్. కే షబీర్ పాషా,కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్,మిర్యాల రంగయ్య, సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, మడ్డి ఎల్లయ్య, వై.వి.రావు, ముస్కే సమ్మయ్య, వంగ వెంకట్, వీరస్వామి, అన్ని ఏరియాలో బ్రాంచ్ కార్యదర్శులు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు,కొమరయ్యా కుటుంబ సభ్యులు,టౌన్ పార్టీ కార్యదర్శి జములయ్య,కొత్తగూడెం కార్పొరేటర్లు, పార్టీ నాయకులు,మరియు కొమరయ్య గారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన మొక్కలు నాటండి

### పర్యావరణ పరిరక్షణకు సహకరించండి:ఎంపీడీవో జమలారెడ్డి



**బూర్గంపహాడ్ జూన్ 08 (జనంసాక్షి):** యుద్ధప్రాతిపదికన మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. సోమవారం బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ మందా నాగరాజు అధ్యక్షతన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ప్రత్యేక గ్రామసభలో ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో ముందస్తు చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాలుగు రకాల చెత్త సేకరణ గురించి ప్రజలకు వివరించారు. రహదారులు, డ్రైనేజీలు, మురుగునీటి కాల్వలను యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయించాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి తక్షణమే పూడిక తీయించాలని, వీధి దీపాలు పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ సభలో వచ్చిన ప్రజాసమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, వీధిలైట్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా సమస్యలు పంచాయతీ దృష్టికి తీసుకురావాలని దీంతో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ గ్రామసభలో పీఆర్ ఏఈ చక్రధరా చారి, వ్యవసాయాధికారి శంకర్, మిషన్ భగీరథ ఏఈ నితిన్, విద్యుత్ అధికారి ఆదినారాయణ, జీపీవో దీపిక, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, కార్యదర్శి సంపత్ శ్రీనివాస్, భజన సతీష్, ప్రసాద్, బర్ల నాగమణి, హెచ్ఎం రవీలాదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**సారపాకలో...**

మండల పరిధిలోని సారపాక పంచాయతీలో సర్పంచ్ కిషోర్నాయక్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్లు పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛభారత్ ఆశయాల సాధన, పర్యావరణ పరిరక్షణపై చర్చించి ప్రజలకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని, ప్రజాసమస్యలు పరిష్కరించేలా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగభిక్షం, కార్యదర్శి గుగులోత్ రవికుమార్, వార్డుసభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ స్టేట్ జెన్కో చీఫ్ ఇంజనీర్ జనరేషన్ గా పప్పుల రత్నాకర్ సేవలు అభినందనీయం

**కల్లూరు జూన్ 08(జనం సాక్షి)**

కల్లూరు మండలం నకు చెందిన పప్పుల రత్నకర్ తెలంగాణ స్టేట్ జెన్కో చీఫ్ ఇంజనీర్ జనరేషన్ ఉన్నత స్థాయి అధికారిగా అందించిన సేవలు ఎంతో అభినందనీయమని కే టీ పి ఎస్ చీఫ్ ఇంజనీర్ యం ప్రభాకర్ అన్నారు. కల్లూరు మండల పరిధిలోని పేరువంచ గ్రామంలోని విజ్ఞాన్ విహార్ అంబేద్కర్ నగర్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ జెన్కో చీఫ్ ఇంజనీర్గా పదవి విరమణ పొందిన పప్పుల రత్నాకర్ కు ఘనంగా అభినందన సభ ప్రముఖులు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి డి పి ఆర్ ఓ శీలం శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుమూల గ్రామం నుండి తెలంగాణ రాష్ట్రంలోని జెన్కో చీఫ్ ఇంజనీర్గా ఉన్నత స్థాయికి చేరుకొని ఉద్యోగ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పప్పుల రత్నాకర్ భవిష్యత్తులో పేదల జీవితాల్లో వెలుగులను సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. తన కుటుంబంలో 11 మందిని ఇంజనీర్లుగా తయారుచేసి ఆదర్శంగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు . అనంతరం పప్పుల రత్నాకర్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది వయసు కె గాని మనసుకు కాదని ఎప్పుడు అన్నివేళలా అందరికీ తోడుగా నిలిచి నా వంతు సహాయ సహకారాలను అందిస్తూ సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతూ నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటా అన్నా రు. పేదకుటుంబం లో జన్మించి నేడు ఇంత గొప్ప స్థాయికి తీసుకువచ్చిన తల్లిదండ్రుల కష్టం ఎప్పటికీ మరువననితెలిపారు. ఈ కార్యక్రమంలో యం. ప్రభాకర్, చీఫ్ కె టి పి ఎస్5డ6 స్టేజ్, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ వెంకట నరసయ్య, మేకతొట్టి పుల్లయ్య రెసిడెన్షియల్ స్కూల్ రిటైర్డ్ ఆర్ సి ఓ, పప్పుల దాసు, డి ఇ , రవీందర్, సీఐ, డి పి ఆర్ ఓ శీలం శ్రీనివాస్ ఉబ్బన నాగరాజు పేరు వంచ, చెన్నూర్ సర్పంచ్ లు నిర్మలా మోహన్ రెడ్డి, జినుగు శ్రీనివాస్ రావు , రత్నాకర్ లాయర్, రత్నాకర్, విజ్ఞాన విహార్ సభ్యులుపాల్గొన్నారు.

## పరామర్శ




**నూతనకల్ జూన్ 8 (జనంసాక్షి)**

తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా.గాదరి కిషోర్ కుమార్ మండలంలో పర్యటించి పలువురు బిఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు సోమవారం వారు లింగంపల్లి గ్రామంలో సర్పంచ్ మాదాసు చిన్న వెంకన్న గత కొంత కాలంగా స్వల్ప అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి లో చేరి చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించారు ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయనకు సూచించారు అనంతరం కొత్తతండ గ్రామ మాజీ సర్పంచ్ వీరమ్మ హనుమంతు గత కొన్ని రోజు లుగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి, పెదనేమిల గ్రామ మాజీ సర్పంచ్ బాషనపల్లి రాణి ఇటీవల మరణించడంతో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ధైర్యంగా ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎస్ఏ రజాక్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, కనకటి వెంకన్న గౌడ్, సర్పంచ్ లు చురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి, మహేశ్వరం మల్లికార్జున్, జి.కోటేష్ నాయక్, గాడుదల లింగరాజు యాదవ్, మండల బిఆర్ఎస్ నాయకులు రేసు వెంకటేశ్వర్లు, మున్న లింగయ్య యాదవ్, మహేష్, వివిధ గ్రామాల బిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, కిషోర్ అభిమానూలు గణేష్, హర్షిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు లేదా సీడ్ లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

**నేరేడుచర్ల (జనంసాక్షి ):** నకిలీ విత్తనాలు లేదా సీడ్ లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి జావేద్ హెచ్చరించారు. మండలంలోని జయలక్ష్మి ఫెర్టిలైజర్ షాప్ లోని విత్తన సరుకులని,స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సోదరులు అందరు కూడా విత్తనాలు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని,కొనుగోలు చేసిన రసీదును పంట కోసే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలను రైతులు ఎవరు కూడా కొనవద్దని,నకిలీ విత్తనాలు లేదా లూస్ విత్తనాలు లేదా విత్తన లైసెన్స్ లేకుండా ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, ప్రస్తుత వర్షపాతానికి రైతులెవరు కూడా వరి విత్తనాలని వెదజల్లద్దని



సరైన వర్షాపాతం నమోదైన తర్వాత మాత్రమే వెదజల్లాలని,వెదజల్లే పద్ధతి పాటించ రైతులకు సూచించారు.

# ప్రత్యేక వార్డు సభల్లో ప్రజల సమస్యల స్వీకరణ

## - ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హాలియాలో కార్యక్రమం నిర్వహణ

హాలియా, జూన్ 8 జనం సాక్షి:
రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో 10, 11, 12వ వార్డులకు సంబంధించిన ప్రత్యేక వార్డు సభలు సోమవారం అనుముల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. పురపాలక సంఘం చైర్మన్ చింతల చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజల సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టామని తెలిపారు. ప్రధాన రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కోసం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జనపనార, వస్త్ర సంచులను ఉపయోగించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని పేర్కొన్నారు. పురపాలక కమిషనర్ కె. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి వద్దే వ్యర్థాలను



తడి, పొడి, పారిశుధ్య వ్యర్థాలు, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. కొత్తగా గృహ నిర్మాణాలు చేపట్టే వారు వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక వార్డు సభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను వెల్లడించగా, వార్డు ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ దీపావత్ ప్రసాద్ నాయక్, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్, మండల వ్యవసాయ అధికారి, హాలియా పట్టణ ఉప నిరీక్షకుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అడ్వొకెట్ ప్రొటెక్షన్ చట్టం తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నిసంగి విద్యా సాగర్

**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 8 (జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నిసంగి విద్యా సాగర్ గారి ఆధ్వర్యంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ చట్టం తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వనికి రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, విజయ్ భాస్కర్ రెడ్డి, రహీం, యాదగిరి, గోదా వెంకటేష్, బొమ్మ వెంకటేష్, రజిని, జయ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా

## హాలియాలో ఎరువులు, విత్తనాల దుకాణాల తనిఖీ



**హాలియా, జూన్ 8 జనంసాక్షి:**
నకిలీ, నిషేధిత పత్తి విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు నల్లగొండ జిల్లా అనుముల మండలం హాలియాలో వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాలను పరిశీలించి నిల్వాలు, అనుమతి పత్రాలు, విక్రయ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గుర్తింపు పొందిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ, నిషేధిత విత్తనాలను విక్రయించినా, కొనుగోలు చేసినా నష్టపోయేది రైతులేనని పేర్కొన్నారు. తొలకరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు వాతావరణ పరిస్థితులను గమనించి అనుకూల సమయాల్లో విత్తనాలు విత్తాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు శాఖ నిరంతరం చర్యలు చేపడుతుందని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి, కరస్పొండెంట్ జూన్ 8 (జనం సాక్షి)**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి



కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 72 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవిన్యూ శాఖ 48, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్ 3, గ్రామీణ అభివృద్ధి 3, పిడి హౌసింగ్ 3, సంక్షేమ శాఖ 2, వ్యవసాయ, ఇరిగేషన్, ఉపాధి కల్పన, విద్య, బీసీ వెల్ఫేర్, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , ఆర్డీవో శేఖర్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సర్ పక్రియను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**కారేపల్లి,జూన్08( జనంసాక్షి ) :**
కారేపల్లి మండలంలో ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)ను జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ పీ.శ్రీజ సోమవారం తనిఖీ చేశారు. గాదెపాడు గ్రామంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రత్యేక ఓటర్ల సవరణలో ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించాలని బీఎల్‌వో, బీఎల్ఏ లకు సూచించారు. సర్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఆర్ఐ జగదీశ్, జీపీవో శ్రీనివాస్, సర్పంచ్ భూక్య రంజిత్‌కుమార్ తదితరులు ఉన్నారు.



# సామాజిక బాధ్యతతో సాగుతున్న తల్వార్ తాత ప్రజా చైతన్య యాత్ర

## విద్య, ఆరోగ్యం, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

**మర్రిగూడ, జూన్ 8 (జనంసాక్షి):**
వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల మధ్యకు వెళ్లి సామాజిక చైతన్యం కల్పిస్తున్న తల్వార్ తాత (కొప్పు సంజీవ్) చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడం, యువతను గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా చైతన్యం కల్పించడం లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతోంది.
గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పిస్తూ తల్వార్ తాత తన సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. ముఖ్యంగా యువత భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, సామాజిక విలువల పరిరక్షణపై ఆయన చేస్తున్న ప్రచారం గ్రామీణ ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారుతోంది.
"విద్యే అభివృద్ధికి పునాది ? మత్తు పదార్థాలకు దూరమే యువతకు భవిష్యత్తు" అనే సందేశంతో కొనసాగుతున్న ఈ ప్రజా చైతన్య యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం నారాయణపురం మండలంలోని మల్లారెడ్డిగూడెం గ్రామానికి చేరుకున్న యాత్ర బృందానికి గ్రామ ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యత, విద్యార్థుల భవిష్యత్తు, యువతలో పెరుగుతున్న గంజాయి, డ్రగ్స్, మద్యం వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. సమాజంలో సానుకూల మార్పు రావాలంటే విద్య, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత ఎంతో అవసరమని తల్వార్ తాత పేర్కొన్నారు.
గ్రామ ప్రజలు యాత్ర లక్ష్యాలను అభినందిస్తూ, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా



నిర్వహించాలని కోరారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు, గ్రామ గ్రామాన తిరుగుతూ విద్య, ఆరోగ్యం, యువత భవిష్యత్తు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని యాత్ర బృందం వెల్లడించింది. గ్రామీణ సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు చేపట్టిన ఈ పాదయాత్ర ప్రజల మద్దతుతో ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో డప్పు రమేష్, కొండ లలిత, డప్పు కరుణాకర్, ఊరిపక్క రాఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధీ లేక పెరుగుతున్న వలసలు

## కార్మికుల సమస్యల పరిష్కారంకు మహసభలలో ప్రణాళిక

## ఈనెల 10న వ్యకాస జిల్లా మహాసభ

**కారేపల్లి, జూన్ 08 (జనంసాక్షి ) :**



కేంద్ర రాష్ట్ర పాలకులు పేదలకు ఉపాధి కల్పనలో విఫలమైనారని దాని పర్యావసానంగా పట్టణాలకు వలసలు పెరిగాయాని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, తాళ్లపల్లి కఅష్ట తెలిపారు సోమవారం కారేపల్లి మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలోని దళిత, గిరిజన, గిరిజనేతర పేదలు అత్యధికంగా వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు కారణంగా పనులు దొరకక పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లి అడ్డా కూలీలుగా మారుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ గ్యారెంటీ చట్టం రద్దుచేసి వీబీజీ రామ్‌జీ బిల్లు పేరుతో కొలతలు విధానం, రెండు సార్లు ఫోటో పద్ధతి తీసుకువచ్చిందన్నారు. బడ్జెట్‌లో ఉపాధికి నిధులు తగ్గించి పేదలకు ఉపాధి దూరం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, పెన్షన్ల పెంపు వంటి అనేక హామీలు వాగ్దానాలకే పరిమితమయ్యాయన్నారు. వ్యవసాయ కార్మికులకు పని గ్యారంటీ భద్రత చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా మహాసభ ఈనెల 10న ముదిగొండ మండలం వెంకటాపురంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలో వ్యవసాయ కార్మికుల సమస్యలు, ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు చర్చించి పోరాటాల ప్రణాళిక రూపొందించటం జరుగుతుందన్నారు. వ్యకాస మహాసభ సందర్భంగా జరుగు ప్రదర్శనకు కూలీలు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో వ్యకాస మండల అధ్యక్ష కార్యదర్శులు కేసగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, నాయకులు పాసిన్ని నాగేశ్వరరావు, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ మోసాలపై ఉక్కుపాదం మోపాలి

**కారేపల్లి,జూన్08( జనంసాక్షి ) :**



ఆన్‌లైన్ మోసాలు హెచ్చుమీరిన క్రమంలో మోసానికి గురైనా బాధితులకు న్యాయం చేయటంలో ఉదాసీనత లేకుండా ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి యువతను ఆకర్షిస్తూ, "పెట్టుబడి లేకుండా లక్షలు సంపాదిం చండి", "ఇంట్లో కూర్చునే ఆదాయం పొందండి" అంటూ ప్రచారం చేసి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్న ఖమ్మం జిల్లా సింగరేణి మండలం సూర్యతండ గ్రామానికి చెందిన యూట్యూ బర్ ఓకే సాయి అలియాస్ బానోత్ సాయి నాథ్ వ్యవహారం మరోసారి చర్చ నీయాంశంగా మారింది. ఇప్పటికే పలువురు బాధితుల ఫిర్యాదులతో కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదవగా, బాధితులు తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. బాధితుల కథనం ప్రకారం, ట్రాప్ షిప్పింగ్ కోర్సులు, ఆన్‌లైన్ బిజినెస్ శిక్షణ పేర్లతో యువతను ఆకర్షించి వేలాది రూపాయలు వసూలు చేసినప్పటికీ, చెప్పిన విధంగా ఆదాయం రాలేదని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువకులు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు తమ కష్టార్జిత డబ్బును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారానికి సంబంధించి పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించగా, గతంలోనూ వివిధ చీటింగ్ ఆరోపణల్లో ఇదే పేరు వినిపించిందని స్థానికులు పేర్కొంటున్నారు. సోషల్ మీడియాలో రెండేళ్లుగా వస్తున్న ఆరోపణలు, ప్రస్తుతం నమోదైన కేసులు, బాధితుల వాంగ్మూలాల నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని సాధారణ ఫిర్యాదుగా కాకుండా సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.కేవలం కేసు నమోదు చేసి విచారణ కొనసాగిం చడం సరిపోదని, డబ్బులు చెల్లించి నష్టపోయిన

# ఓకే సాయి బాధితులకు న్యాయం జరగాలి

బాధితుల వివరాలను సేకరించి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు. అవసరమైతే సైబర్ క్రైమ్, ఆదాయపు పన్ను, ఆర్థిక నేరాల విభాగాలు కూడా రంగంలోకి దిగి లావాదేవీలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.సోషల్ మీడియా ద్వారా కోట్లాది రూపాయల వ్యాపారాలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకునే వ్యక్తుల ఆదాయ వనరులు, ఆర్థిక లావాదేవీలు, ప్రజల నుంచి సేకరించిన నిధుల వినియోగంపై సంబంధిత శాఖలు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నిరుద్యోగ యువత ఆశలను ఆసరాగా చేసుకుని ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నమోదైన కేసులపై పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, తప్పు నిరూపితమైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఆన్‌లైన్ మోసాల పేరుతో ప్రజల కష్టార్జిత ధనాన్ని దోచుకునే వారిపై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు...

### కాంగ్రెస్ మండలఅధ్యక్షుడిగా ఉప్పునుతుల

# వెంకటేష్ నియామకం

**భూదాన్ పోచంపల్లి, జూన్ 8 (జనంసాక్షి )**

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉప్పునుతుల వెంకటేష్ నియమితుల య్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నియామక పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఉప్పునూతుల వెంకటేష్ మాట్లాడుతూ తనకు పార్టీ మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాక మల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మర్రి నరసింహారెడ్డి, సామ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, మండల నాయకులు గోరంటి శ్రీనివాస్ రెడ్డి, మలిపెద్ది అమరేష్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని ఆయన తెలిపారు.





# గ్రామాల అభివృద్ధికి సహకరించాలి :తహసిల్దార్ రాజశేఖర్ రెడ్డి

**పెన్ పహాడ్, జూన్ 08 (జనం సాక్షి) :**

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసిల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో అవిరేండ్ల జానయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం మండల పరిధిలోని మాచారం, లింగాల గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు ఇటికాల శ్రీనివాస్, గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలలో ప్రత్యేక అధికారులుగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ముఖ్యంగా గ్రామాల్లో త్రాగునీరు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చూడాలని గ్రామ పాలకులకు సూచించారు లింగాల గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని కోతులు పరువురిని గాయపరుస్తూ ఇళ్లల్లో చొరబడి ఇబ్బందులు గురిచేస్తున్నాయని కోతుల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామసభలో గ్రామస్తులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు అదేవిదంగా మేఘ్య తండా,నారాయణ గూడెం, మోర్సకుంట తండా, ఎన్ అన్నారం, నాగులపహాడ్ గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచుల భూక్యా రాజు, నాతాల నాగరాణి, భూక్యాలింగమ్మ హుస్సేన్,ముత్తినేని శ్రీనివాస్,సంకరమద్ది నిరంజన్ రెడ్డి,అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలలో వివిధ శాఖల అధికారులు పాల్గొని అభివృద్ధి ప్రణాళికల వివరాలు తెలియజేశారు గ్రామాలలో నెలకొన్న సమస్యలను గ్రామ సభ దృష్టికి తీసుకువస్తే అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు ప్రజల సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు రానున్న వర్షాకాలానికి మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి, సిబ్బంది ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారులు ఎంపీఓ రాజేశ్వర్, పశు వైద్యాధికారి కిరణ్ కుమార్, ఎంఈఓ నకిరేకంటి రవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ జాన్ ఫ్రెడ్, అనంతుల వెంకన్న, ఉపసర్పంచులు,కార్యదర్శులు వై. వెంకటలక్ష్మి, సిహెచ్ జానయ్య, గద్దల శ్రవణ్ కుమార్,పి. సంజయ్ కుమార్, ఎస్. విజయ్ కుమార్, డి. నరేష్, ఆయా శాఖల అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు...



# ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు సర్పంచ్ ముత్తినేని శ్రీనివాస్

**పెన్ పహాడ్, జూన్ 08(జనంసాక్షి) :**

రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కొరకు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తానని సర్పంచ్ ముత్తినేని శ్రీనివాస్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలోనీ రైతు వేదికలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు,పెన్షన్ లు అందించే బాధ్యత తనదని దళారులను నమ్మి ఇబ్బందుల పాలు కావద్దని గ్రామ ప్రజలకు సూచించారు పింఛన్ల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు గ్రామానికి మొదటి విడతలో 53 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగిందని కాగా ఇప్పటివరకు 47 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వాటిలో కొంతమంది గృహప్రవేశాలు చేశారని త్వరలో ప్రకటించే రెండో విడతలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఏ ఈ ఈ ఆర్డబ్ల్యూఎస్ జాన్ ఫ్రెడ్, ఏఈఓ శ్రావణి, కార్యదర్శి డి. నరేష్, వైద్య ఆరోగ్య , విద్యుత్తు శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు...

# బుజిలపురంలో పట్టపగలు చోరీ

## బంగారం, వెండి, నగదు అపహరణ

**మోత్కూరు మే 8 (జనం సాక్షి)**



మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని బుజిలపురం గ్రామంలో సోమవారం పట్టపగలు జరిగిన చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు ఐదున్నర తులాల బంగారం, 33 తులాల వెండి ఆభరణాలు, నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు. బాధితుడు మల్లిపెద్ది వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 11 గంటల సమయంలో వ్యవసాయ అవసరాల కోసం ఎరువులు తీసుకురావడానికి మోత్కూరుకు వెళ్లారు. ఆయన భార్య పద్మ మూడు రోజుల క్రితమే బంధువుల గ్రామానికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి వెళ్లినట్లు చెప్పారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో తిరిగి ఇంటికి చేరుకోగా ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించి కుటుంబ సభ్యులను పిలిపించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉండటంతో అందులో భద్రపరిచిన నాలుగు తులాల బంగారు చంద్రహారం, అర తులం బంగారు బ్రాస్లెట్, అర తులం బంగారు ఉంగరాలు రెండు, అర తులం బంగారు కమ్మలు, మూడు తులాల వెండి గొలుసు, 30 తులాల వెండి పట్టాలు రెండు జతలు, రూ.5 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. గ్రామంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ అనుమానితుల కదలికలపై దర్యాప్తు చేపట్టారు. బాధితుడు మల్లిపెద్ది వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మోటకొండూరులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్ శ్రేణులు

**జూన్ 8 వచ్చినా రైతుల కష్టాలు తీరలేదు..**

**ప్రభుత్వం సమాధానం చెప్పాలి బిఆర్ఎస్ డిమాండ్!**



**మోటకొండూరు, జూన్ 08 (జనంసాక్షి):–** మోటకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం నాడు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో వడ్ల అమ్మకాల తీరును పరిశీలించి, అక్కడ ఎదురవుతున్న ఇబ్బందులపై రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వడ్ల కుప్పల వద్ద రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత కొద్దిరోజుల క్రితం స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఇదే కొనుగోలు కేంద్రాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జూన్ 2వ తేదీ వరకే వడ్ల కొనుగోళ్లు పూర్తిగా ముగిసిపోవాలని, ఆలస్యమైతే అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ, నేడు జూన్ 8వ తేదీ దాటినా కొనుగోలు కేంద్రానికి వడ్లు వస్తూనే ఉన్నాయని, రైతులు ఇంకా కల్లాల్లోనే అష్టకష్టాలు పడుతున్నారని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం ఎంత బాధ్యతగా ఉన్నదో ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. అదేవిధంగా కొనుగోలు కేంద్రంలో బస్తా కొన్ని కిలోల చొప్పున కటింగ్ (తరుగు) పేరిట కటింగ్ చేసి తూకం వేస్తున్నారని, మాయిశ్చర్ (తేమ శాతం) వచ్చిన తరువాత కూడా తాలు పట్టిన తర్వాతనే తూకం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరి ఇలా క్వింటా చొప్పున అన్యాయంగా తరుగు తీస్తూ కట్ చేస్తున్న ధాన్యం ఎక్కడికి పోతుందో అధికారులు సమాధానం చెప్పాలని, తక్షణమే ఈ దోపిడీని ఆపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ సెక్రటరీ జనరల్ సిరబోయిన నర్సింగ్ యాదవ్, మోటకొండూరు ఉపసర్పంచ్ బోట్ల నరసింహ, ముఖ్య నాయకులు జీవికపల్లి వెంకటేష్, బోట్ల మహేష్, బోట్ల పాండు, గంధమల్ల మధు, ముల్గ వెంకటేష్, కొల్లూరి మైసయ్య, దబ్బెల్లి బాలకృష్ణ, కొండమడుగు వీరనరసయ్య, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.




## కేంద్రీయ విద్యాలయం లో సీట్లు



**జనంసాక్షి,మిర్యాలగూడ :** మిర్యాలగూడ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లో ఎంపీసీ, బైపీసీ కలిపి 7 ఖాళీలు, 9వ తరగతి లో 16 ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ శ్రీ కే ఎన్ ప్రసాద్ ఒక ప్రకటన లో తెలిపారు. ఎంపిక అంతా కేంద్రీయ విద్యాలయ నిబంధనల ప్రకారం జరుగుతాయని,ఆసక్తి ఉన్నవారు 16.06.2026వరకు ఆన్లైన్‌లో అప్లై చేసుకోవాలని, 9వ తరగతి ఖాళీలు రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు.

## సీజన్ వ్యాధుల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**వలిగొండ,జున్ 8(జనంసాక్షి)** మండలంలోని పులిగిల్ల గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు . అనంతరం సర్పంచ్ వేముల అనూష మల్లేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ చెట్లు నాటుతూ, వర్షపు నీటిని నిలువ చేస్తూ గ్రౌండు వాటర్ పెరిగే విధంగా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకుంటూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తు ఉండాలని కోరడం జరిగింది . ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, కార్యదర్శి సైదులు, పాలక వర్గ సభ్యులు, వైద్య అధికారులు, విద్యుత్ అధికారులు, వ్యవసాయ అధికారి , వెటర్నరీ డాక్టర్ , ఇందిరమ్మ ఇళ్ల ఏఈ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది.

### పెంచిన డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి : అంజయ్య చారి

**నాంపల్లి,జూన్ 8 (జనం సాక్షి)** కేంద్ర ప్రభుత్వం డీజిల్ ,పెట్రోల్ ,గ్యాస్ ,నిత్యవసర వస్తువులు పై అధిక ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి కేంద్రం ప్రభుత్వంపై మండిపడ్డారు. నాంపల్లి మండలం సిపిఐ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సిపిఐ పార్టీ మండల కార్యవర్గ సభ్యుల సమావేశం కోరే సత్తయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అంజయ్య చారి పాల్గొని మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా, డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యవసర వస్తువులపై పెంచిన అధిక ధరలను తగ్గించాలని బిజెపి ప్రభుత్వం పనితీరును ఖండిస్తూ జూన్ 10 న నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట 1000 మందితో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి వందలాది మంది పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నేతాళ్ళ రాజు, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు జనం పాట జగన్, మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,పల్లే సైదులు,నేరళ్ళ సైదులు, కౌన్సిల్ సభ్యులు,దామేర రమేష్,పల్లేటి దశరథ,బక్కయ్య,గొడ్డేటి సత్తయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## దరఖాస్తుల ఆహ్వానం



**నూతనకల్ జూన్ 8 (జనం సాక్షి)** మండల పరిధిలోని ఎంపిక చేయబడిన 3 ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీపీఎస్ తాళ్ల సింగారం, ఎంపియుపిఎస్ ఎడవెల్లి, ఎంపీపీఎస్ ఎర్రపహాడ్ లలో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించుటకు ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ , ఆయా పోస్టుల భర్తీ కి అర్హులైన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం అందరూ నూతనకల్ మండలం వనరుల కేంద్రంలో ఈ నెల 10.06.2026 తారీకు లోపు దరఖాస్తు చేసుకోవలసిందిగా మండల విద్యాధికారి బి. రాములు నాయక్ తెలియజేశారు 1) ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ గౌరవ వేతనం 8000, 2) ఆయాకు 6000 చెల్లించడం జరుగుతుంది ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ఇంటర్మీడియట్ 10+2 మరియు ప్రీ ప్రైమరీ ట్రైనింగ్ సర్టిఫికెట్ మరియు ఆయాకు 7 వ తరగతి విద్యా అర్హతలుగా ఉండవలెను దరఖాస్తుదారుడు ఎంపిక కాబడిన గ్రామపంచాయతీ స్థానికత మాత్రమే కలిగి ఉండాలి. ఆయా గ్రామపంచాయతీలలో ఉన్న వాళ్ళ దరఖాస్తులు రాని ఎడల హ్యాబిటేషన్ గ్రామపంచాయతీని పరిగణలోకి తీసుకుంటారు దరఖాస్తుదారుల తమ విద్యా అర్హతలు 1 ఆదాయము ,కులము ,నివాస ధ్రువీకరణ పత్రములు, 2 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు దరఖాస్తు ఫారం వెంట జత చేసి అట్టేస్టెడ్ చేయించి 2 జతల దరఖాస్తు ఫారంలను నూతనకల్ మండల వనరుల కేంద్రంలో అందజేయవలసిందిగా కోరనైనది కౌన్సిలింగ్ సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించవలసి ఉంటుంది మరిన్ని వివరాలకై నూతనకల్ మండలం విద్యా వనరుల కేంద్రం ను సంప్రదించవలసినదిగా వారు తెలియజేశారు.

### జాతీయ స్థాయిలో సత్తా చాటిన

## పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్

- ○మూడు ప్రతిష్టాత్మక అవార్డుల కైవసం
- ○బెస్ట్ చైర్మన్‌గా తడక రమేష్




**భూదాన్ పోచంపల్లి, జూన్ 8 (జనంసాక్షి):** జాతీయ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల సమ్మేళనం 2026 అట్టహాసంగా జూన్ 5 నుంచి జూన్ 7 వరకు లక్నో పట్టణంలో నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన భారతరత్న సహకారిత సమ్మాన్ 2026 అవార్డుల ప్రధానోత్సవంలో పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మూడు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకుంది. బ్యాంకు బెస్ట్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్, బెస్ట్ చైర్మన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అందుకోగా, బెస్ట్ ఎన్‌పీఏ మేనేజ్‌మెంట్ అవార్డు కూడా బ్యాంకుకు దక్కింది. ఈ అవార్డులను లక్నో ఎమ్మెల్యే పుకాన్ చేతుల మీదుగా బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈఓ సీత శ్రీనివాస్ స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు వరుసగా జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ అవార్డులు బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది, ఖాతాదారులు, వాటాదారుల సమిష్టి కృషికి దక్కిన గుర్తింపు అని, భవిష్యత్తులో కూడా ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం అని అన్నారు. బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మక అవార్డులు సాధించడం పట్ల ఖాతాదారులు, వాటాదారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డులు బ్యాంకు సేవలు, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్, సూరెపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా : ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

**నాగార్జునసాగర్ జూన్ 8, జనంసాక్షి**

ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమం లో భాగంగా పైలాన్ కాలనీ నాగార్జునసాగర్ ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల బడిబాట కార్యక్రమం వాల్ పోస్టర్ ని సోమవారం ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఆవిష్కరించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యా అందుతుందని, పాఠశాలల బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ధాత వేమూరు అభి రమేశ్వర రావు, ప్రధానోపాధ్యాయులు పి.శేషు, ఉపాధ్యాయులు రాజబాబు, విమల, అంజయ్య,నరేష్ బద్రీనాథ్,అజయ్ రాణి,వరలక్ష్మి పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవా సమితి సభ్యుడికి ఆర్థిక సాయం

**మోటకొండూర్, జూన్ 8(జనంసాక్షి):**



ప్రమాదవశాత్తు గాయపడిన అయ్యప్ప సేవా సమితి సభ్యుడికి తోటి సభ్యులు మానవత్వంతో అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప సేవా సమితి సభ్యుడు దేవరకొండ సత్యనారాయణ తన వృత్తిపరమైన పనిలో భాగంగా ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయన కుడి చేతికి తీవ్ర గాయమైంది. ?విషయం తెలుసుకున్న సమితి సభ్యులు స్పందించి, బాధితుడికి తోచిన సహకారాన్ని సేకరించారు. సోమవారం సత్యనారాయణ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం సేకరించిన రూ. 23,500 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు.?ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు వంగాల చంద్రమౌళి గౌడ్, సభ్యులు అనంతుల శోభన్ రెడ్డి, బచ్చు శ్రీశైలం, మానేగల్ల విక్రమ్, మల్ల వెంకటేష్, చందోజు శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల, కుక్కల నుండి రక్షణ కల్పించండి

### వార్డు సభలో 17 వార్డ్ ప్రజల డిమాండ్

దేవరకొండ, జూన్ 08(జనం సాక్షి)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా సోమవారం 17వ వార్డుల్లో ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల నిర్వహణలో భాగంగా సంతోష్ మాత, సంజయ్ కాలనీ లో వార్డు సభ ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఎస్ డబ్ల్యూ ఎం నియామకాల 2026 గురించి, వర్షపు నీటి సంరక్షణ, కాలువల శుభ్రత, వర్షాకాల సంసిద్ధత, త్రాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, గురించి వార్డ్ ఆఫీసర్ పి నామ ప్రజలకు తెలియజేశారు,అలాగే వార్డు సభకు వచ్చినటువంటి ప్రజలు ముఖ్యంగా సంతోషిమాత కాలనీ, సంజయ్ కాలనీలో కోతుల నుండి మరియు కుక్కల నుండి రక్షణ కల్పించాలని వార్డు ప్రజలు తమ సమస్యలను వాడు సభలో అధికారుల, ప్రజా ప్రతినిధుల, దృష్టికి తీసుకువచ్చారు, ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పొట్ట మధు , కో- ఆప్షన్ నెంబర్ వైయస్ సిపోరమ్మ కరుణాకర్, మున్సిపల్ అధికారి జి రాకేష్ కుమార్ వార్డ్ ఆఫీసర్ పి నామ, ఆర్ పి షామా పర్వీన్, అంగన్వాడి టీచర్ బాలమణి, వివిధ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.





## స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు

**మేళ్లచెరువు, జనంసాక్షి**

సోమవారం పర్వదినం పురస్కరించుకొని మేళ్లచెరువులోని శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతులకు విశేష సేవలు జరిగాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యా వచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సహస్రనామార్చన, పుష్పార్చన సేవలు అర్చకులు స్వామి వారికి ఘనంగా జరిపారు. అనంతరం గోపూజ మహా నివేదన, మంగళ నీరాజనం, తదితరపూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకవర్గ మాజీ చైర్మన్ పెండ్లి లచ్చయ్య, పాలకవర్గ సభ్యులు వరగాని నాగరాజు, అంజిరెడ్డి,ము డెం శ్రీనివాసరెడ్డి, బొరెడ్డి వెంకటరెడ్డి,రామారావు, దేవమణి, రామకృష్ణ, ఆలయ కార్య నిర్వహణ అధికారి,ఎన్. శంబిరెడ్డి ఆలయ అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, సాయి మహేష్ శర్మ పాల్గొన్నారు.

## ఇంద్రియాలలో రైస్ మిల్లును పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ వెంకా రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, జూన్ 8 (జనంసాక్షి):**

మండలంలోని ఇంద్రియాల గ్రామంలో ఉన్న కన్యక పరమేశ్వరి రైస్ మిల్లును అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకా రెడ్డి పరిశీలించారు. రైస్ మిల్లులో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లులు నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ నాణ్యత ప్రమాణాలు పాటించాలి. రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి రోజా రమణి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిటీ బాలమణి, శివారెడ్డి గూడెం సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, నాయకులు వారాల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ శాసన సభ్యులు కొమ్మిడి నర్సింహారెడ్డి ని పరామర్శించిన గాదె నరేందర్ రెడ్డి

**యాదాద్రి, కరస్పాండెంట్ జూన్ 8 (జనం సాక్షి)**



భువనగిరి నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు కొమ్మిడి నర్సింహారెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గాదె నరేందర్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు . అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు. భగవంతుని ఆశీర్వాదంతో పెద్దలు కొమ్మిడి నర్సింహారెడ్డి తొందరగా కోలుకోవాలని కోరుకున్నారు.



## జన విజ్ఞాన వేదిక పనితీరుపై కలెక్టర్ ప్రశంసలు

**నల్లగొండ,జూన్ 8,(జనంసాక్షి):**

ఎండలో తీవ్రతలో ఉపాధి కూలీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై గత 40 రోజులుగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల తో జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ప్రశంసించారు. సోమవారం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధులు కలెక్టర్ ఛాంబర్ లో ఆయనను కలిసిన సందర్భంగా కలెక్టర్ పై విధంగా స్పందించారు. సమాజ ఉపయోగ కార్యక్రమాలను స్వచ్ఛందంగా జన విజ్ఞాన వేదిక చేపట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలికా శిశు సంక్షేమ శాఖ సహకారంతో డిజైన్ చేసిన పోస్టర్లను విడుదల చేశారు. విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రతినిధులు ప్రొఫెసర్ బి.యన్.రెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శి ఎన్ వెంకటరమణారెడ్డి జన విజ్ఞాన వేదిక చేస్తున్న శాస్త్ర సాంకేతికత వైఖరులపై అవగాహన కార్యక్రమాల వివరాలను కలెక్టర్కు వివరించారు మూఢనమ్మకాల అంశంపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించడంతోపాటు మూఢనమ్మకాల ఘటనలపై ఆయా గ్రామాల్లో ప్రజల్లో నెలకొన్న మూఢవిశ్వాసాల కు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించడం, ఉన్నత పాఠశాల విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ సంబరాలు నిర్వహించడం ప్రతి ఏటా జనవిజ్ఞాన వేదిక చేపడుతున్నట్లు కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు బి.యన్.రెడ్డి , కోయ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్ వెంకట రమణారెడ్డి తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కోలా శ్రీనివాస్, మహిళా సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ దగ్గుపాటి విమల జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చేపూరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## పేదలపై పెను భారం మోపుతున్న మోడీ ప్రభుత్వం

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి

**రామన్నపేట, జూన్ 8 (జనంసాక్షి):**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రోజురోజుకు పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు పెంచడంతో సామాన్యులపై పెను భారాలు పడుతున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు,సిపిఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో బలుగురి అంజయ్య అధ్యక్షతన మండల కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ పేదలపై ధరల భారాన్ని మోపుతూ సాధారణ మధ్యతరగతి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని అన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన భారతదేశంలో పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వెనక ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. నిత్యావసర ధరలే కాకుండా వ్యవసాయ ఆధారిత ఎరువుల ధరలు పెంచి పండించిన పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించకుండా రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టు వేయడం జరుగుతుందని అన్నారు. అక్షయ దిన్ ఆయోగా అంటూ సచ్చే దినాలను తీసుకొస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామీణ స్థాయిలో ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు.

**నూతన పెన్షన్లను వెంటనే విడుదల చేయాలి**

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య**

రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు అందరికీ పెన్షన్ ఇస్తానన్నడంతో అనేకమంది వృద్ధులు వికలాంగులు గ్రామపంచాయతీ కార్యాలయాల చుట్టూ మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని, ప్రజల్లో గందరగోళం నెలకొల్పకుండా వెంటనే నూతన పెన్షన్లను విడుదల చేయాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు పంపిణీ చేయాలని లేని పక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెల్ల నరసింహ చారి, కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు నాగటి ఉపేందర్, గొరిగే సోములు, గాదె నరేందర్,ఆమనగంటి నగేష్, మేడి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ధారా నియామకం

**దమ్మపేట జూన్8(జనంసాక్షి):**
దమ్మపేట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త దమ్మపేట మండలం మాజీ వైస్ ఎంపీపీ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ దారా మల్లికార్జునరావు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా దమ్మపేట మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు పసుమర్తి రామభద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దారా మల్లికార్జునరావును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రామభద్రరావు మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న ధారా మల్లికార్జునరావుకు రాష్ట్ర స్థాయి బాధ్యతలు దక్కడం దమ్మపేట మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఆయన మరింత సమర్థవంతంగా సేవలందించి సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అత్తులూరి పోసి వెంకట సీతారామరాజు, మండవల్లి సురేష్, చారు గుండ్ల ప్రదీప్, దొడ్డా వినోద్ కుమార్ తదితరులు పాల్గొని దారా మల్లికార్జునరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## తహసీల్దార్ ముందు బైండోవర్

నేరేడుచర్ల (జనంసాక్షి) శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని నేరేడుచర్ల ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన అమరబోయిన లింగయ్య,అనే వ్యక్తి,కట్ట పల్లవి, వ్యవసాయ పొలంలో అక్రమంగా ప్రవేశించినందుకు గతంలో క్రైమ్ నెం. 77/2026 కింద కేసు నమోదు చేయబడింది.ఆ కేసులో అమరబోయిన లింగయ్యను సత్ప్రవర్తన నియమావళి, కింద రూ.5,00,000/- పూచీకత్తుతో బైండోవర్ చేయడం జరిగిందని. అయితే, బైండోవర్ చేసినప్పటికీ అమర బోయిన లింగయ్య తన ప్రవర్తనలో మార్పు తెచ్చుకోకుండా మళ్లీ కట్ట పల్లవి, పొలంలో అక్రమంగా ప్రవేశించడంతో అతనిపై క్రైమ్ నెం.103/2026 కింద మరోసారి కేసు నమోదు చేయబడింది. అమ్మనబోయిన లింగయ్య ప్రవర్తనలో ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో, సోమవారం నేరేడుచర్ల తహసీల్దార్ సమక్షంలో నేరేడుచర్ల ఎస్ఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో అతనిని రూ.5,00,000/- పూచీకత్తుతో బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

# జర్నలిస్ట్ రామకృష్ణపై అక్రమ కేసును వెనక్కి తీసుకోవాలి

### సోమవారం తిరుమలాయపాలెంలో జర్నలిస్టుల నిరసన - ప్రెస్ క్లబ్ సంపూర్ణ మద్దతు



**తిరుమలాయపాలెం, జూన్ 8 (జనంసాక్షి)**
ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించడం నేరం కాదని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో రాజకీయ విమర్శలు చేసినంత మాత్రాన క్రిమినల్ కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధమని తీర్పు వెలువరించింది. భావప్రకటనా స్వేచ్ఛ ఆర్టికల్ 19(1)(ఎ) పరిధిలోకి వస్తుందని, పోస్టులు ఘాటుగా ఉన్నంత మాత్రాన నేరం కాదని జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం పేర్కొంది. శ్రేయా సింఘాల్ కేసును ఉదహరిస్తూ, యాంత్రికంగా కేసులు నమోదు చేయరాదని పోలీసు లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జర్నలిస్ట్ రామకృష్ణపై నమోదు చేసిన అక్రమ కేసును తక్షణమే వెనక్కి తీసుకోవాలని జర్నలిస్టుల బృందం డిమాండ్ చేసింది. సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలిపిన జర్నలిస్టులు, పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలు రాస్తే అవాస్తవాలతో, ఆధారాలు లేని కేసులు మోపడం తగదు. ప్రశ్నించే జర్నలిస్టులపై పోలీసు అధికారులు కేసులు పెట్టడం మానుకోవాలి. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని జర్నలిస్టులు స్పష్టం చేశారు. రామకృష్ణకు ప్రెస్ క్లబ్ కమిటీ అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు మాట్లాడుతూ సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధితుల సమాచారం మేరకు కథనాలు రాసినందుకే రామకృష్ణపై కక్షతో కేసు పెట్టారు. బెదిరించాడని, డబ్బులు డిమాండ్ చేశాడని ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణలకు ఒక్క ఆధారమైనా పోలీసులు బయటపెట్టాలి. విచారణ లేకుండా నేరుగా కేసు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడి. ఆధారాలు లేకుండా కేసులు పెట్టడం పోలీసు వ్యవస్థకే మాయని మచ్చ అని ధ్వజమెత్తారు."అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి. న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రెస్ క్లబ్‌లను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. అవసరమైతే న్యాయపోరాటం చేస్తాం" అని పప్పుల శ్రీనివాసరావు హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో స్థానిక, మండల జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు కూరపాటి విజయ్ గుజ్జా రామకృష్ణ, ఉబ్బని సుందర్, గాదరి బాబు, గోవిందు సురేష్, మేకల నాగరాజు, ఎలిమల్ల శ్రీను, గాదరి వెంకన్న, రాజేష్ కూరపాటి ఉపేందర్ మెట్టు రుద్రరాజు దామల్ల భాస్కర్ సురేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేసును ఖండించారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిష్పాక్షిక విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరారు.

# పూడ్చిన వాగు మట్టిని తొలగించిన రెవెన్యూ అధికారులు..

**గండి మొత్త వాగు పరిరక్షణలో ఎంఆర్వో చొరవ..**

**ఈ ప్రాంత ప్రజలు భయం గుప్పిట్లో జీవనం..**

**మణుగూరు, జూన్ 08 (జనంసాక్షి):**
సహజ జలవనరుల ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ ఉండదనే ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాల్సిన బాధ్యత రెవిన్యూ శాఖపై ఉందని మండల తహసిల్దార్ అద్దంకి నరేష్ అన్నారు. సోమవారం మణుగూరు మండలంలోని గండి మొత్త వాగు సహజ ప్రవాహానికి అడ్డుగా పోసిన మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కొంతకాలంగా గండి మొత్త వాగు ఆక్రమణలకు గురైందన్న విషయం తెలిసిందే.. కాలువపై మట్టి పూడిస్తే వర్ష కాలంలో ఇబ్బందులు పడాల్సివస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సమస్యను పరిష్కరించాలని రెవిన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదులు వస్తుండటంతో చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వాగులు పూడ్చడం కేవలం పర్యావరణ నష్టం కాదు ఇది సామాజిక నేరం. తక్షణ లాభాల కోసం సహజ నీటి మార్గాలను అడ్డుకుంటే, దీర్ఘకాలంలో సమాజమంతా నష్టపోతుంది. అక్రమ నిర్మాణాలు, అనుమతుల్లేని కట్టడాలు ప్రకృతికి విరుద్ధమని అన్నారు. వరద వస్తే ముందుగా మునిగేది కాలనీలే. ఇళ్లలోకి నీరు చొరబడి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. విద్యుత్ ప్రమాదాలు, తాగునీటి కాలుష్యం, వ్యాధుల భయం పెరుగుతోంది. మరోవైపు పొలాలు మునిగి పంటలు నాశనం అవుతున్నాయి. రైతు శ్రమ, పెట్టుబడి అన్నీ నీళ్లలో కలిసిపోతున్నాయి. ఇది కేవలం ప్రకృతి విపత్తు కాదు మనిషి చేసిన తప్పుల ఫలితమే గతంలో కూడా మణుగూరు మండలంలో వర్ష కాలంలో వరదలకు ఇళ్లు నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఈ ప్రాంతం కూడా అలాంటి పరిస్థితి రాకూడదని ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.కాలువ పూడ్చడం వల్ల వర్ష కాలంలో వరద ఉధృతికి ఇళ్లు పొలాలు నీట మునిగే పరిస్తితి వస్తోందని అన్నారు.."ప్రజల ఫిర్యాదులను వినడమే కాదు? క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడమే నిజమైన పరిపాలన" అని ఎంఆర్వో చొరవపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈకార్యక్రమంలో డిటి రామారావు, ఆర్ ఐ గోపి,సురేష్, కానిస్టేబుల్ మురళీ ,స్థానికులు తదితరులు ఉన్నారు.





# బక్రీదు పండుగ వల్ల పండితాపురం సంతకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం చెల్లించాలి

- ○లాభాల వైపు రాష్ట్ర ప్రభుత్వం పశువుల సంత వేలం పాట ఖజానా నిండు
- ○నష్టాలలో కురుక్కుపోయిన సంత కాంట్రాక్టర్ అటు వైపు చూడని ప్రభుత్వ అధికారులు ○ప్రభుత్వ అధికారులు స్పందించి సంత నష్టం పై తక్షణమే కాంట్రాక్టర్ కు న్యాయం చేయాలి
- ○పండితాపురం శ్రీ కృష్ణ ప్రసాద్ పశువుల సంత యధావిధిగా కొనసాగిచ్చేటట్టు అధికారులు ఆదేశాలు జారీ చేయాలి
- ○సంత కాంట్రాక్టర్ భూక్య వీరన్న జిల్లా అధికారులను కోరారు



**కామేపల్లి,జూన్ 8 (జనంసాక్షి):**
కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం శ్రీ కృష్ణ ప్రసాద్ పశువుల సంతకు బక్రీద్ పండుగ వలన జరిగిన నష్టానికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఏజెన్సీ ప్రాంతం గిరిజన యువకుడు భూక్య వీరన్న కాంట్రాక్టర్ ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బక్రీదు పండుగ కంటే నెలరోజుల ముందు నుండి పండితాపురం పశువుల సంతలో కామేపల్లి ఎస్సై మౌఖిక ఆదేశాల మేరకు సంతలో పోలీసులు స్వయంగా దగ్గర ఉండి పశువుల అమ్మకాలు కొనుగోలు జరగనివ్వలేదు.వారు గోవులను అమ్మకాలు కొనుగోలు జరిగినట్లయితే కొన్న వారిపై అమ్మిన వారిపై కేసులు పెడతామని బెదిరించడంతో వ్యాపారస్తులు రైతులు సంతకు రాకపోవడం వలన గోవులతో పాటు ఎడ్లు బర్రెలు దూడలు మేకులు గొర్రెలు కూడా రాకపోవడంతో పోలీసులు చెప్పిన విషయాన్ని తెలుసుకుని తమపై కేసులు పెడతారేమోనని భయం చేత ఎవరు కూడా సంతకు తీసుకొని రాలేదని, దీనివలన ఏజెన్సీ ప్రాంతమైన గిరిజన నిరుద్యోగి భూక్య వీరన్న శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల సంత కాంట్రాక్టర్ తో పాటు గిరిజన నిరుద్యోగులమైన నాతోపాటు సంతను తీసుకున్న గిరిజనలు గిరిజ నేతరులు తీవ్రంగా నష్టపోవడం జరిగింది.సంతను బహిరంగ వేలం నిర్వహించేటప్పుడు బక్రీదుకు పశువుల అమ్మకాలు కొనుగోళ్లపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదని, అనూహ్యంగా ఇప్పటికిప్పుడు అలా చేయడం వలన నాలుగు వారాలపాటు పశువులు అమ్మకాలు కొనుగోలు జరగకుండా ఉండటం వలన నష్టం జరిగిందని ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారులు, గ్రామపంచాయతీ వారు సహృదయంతో ఆలోచించి నష్టాన్ని పూడ్చగలరని సంత కాంట్రాక్టర్ భూక్య వీరన్న సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్,డిపిఓ, పశుసంవర్ధక శాఖ జెడి,ఎండిఓ, కొమ్మనేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్, గ్రామపంచాయతీ సెక్రటరీ తదితర అధికారులకు వినతి పత్రం ఇచ్చి విన్నవించడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా జిల్లాలోని అక్రమ రవాణా జరుగుతున్న పశువులను తీసుకొచ్చి సంత ఆవరణలో కట్టి వేయడం వలన ఇంకా వ్యాపారస్తులు రైతులు ఆందోళన చెందుతూ అమ్మకాలు, కొనుగోళ్లు జరిగితే మా పశువుల్ని కూడా కట్టివేస్తారని భయం చేత ఎవరూ రావడం లేదని వీరన్న తెలిపారు.దయచేసి ఆ పశువులను కూడా ఎక్కడికైనా మార్పించవలసిందిగా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బాదావత్ నాగరాజు పాటిబండ్ల ప్రసాదు, మేకల మల్లికార్జునరావు, డేరంగుల తిరపయ్య, ధరావత్ హరిచంద్ర, గుగులోతు రవి, మొగిలి శ్రీను,ఎస్.కె రబ్బానీ పాషా,చల్ల మల్లయ్య,తురక బిక్షం,రాములు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేరాలి

○దేశానికి వెన్నెముక్క రేపటి పౌరులు ○ సమాజ నిర్మాణానికి పునాది విద్యార్థి లోకం ○కొమ్మినేపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుల బడిబాట

కామేపల్లి,జూన్ 8 (జనంసాక్షి): కామేపల్లి మండల పరిధిలోని కొమినేపల్లి గ్రామపంచాయతీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కలిగి ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని సమర్ధవంతమైన ఉపాధ్యాయులు క్రమశిక్షణతో విద్య బోధనలు అందిస్తున్నారని ఈ గ్రామ పిల్లలు తమకు దగ్గర్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేరాలని వారు కోరారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాల వైపు ముగ్గు చూపాలని పిల్లలకు ప్రభుత్వ పాఠశాల లకు పంపాలని మండలంలోని కొమ్మినేపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు జి వెంకటేశ్వర్లు అన్నారు.కొమ్మినేపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం బోధన జరుగుతుందని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని తెలిపారు.పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, బ్యాగులు లాంటి 24 రకాల వస్తువులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని వెల్లడించారు.ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు తమ పిల్లల కోసం బంగారు బాట వేసి భవిష్యత్తుని మార్చాలని వారి చేతిలోనే ఈ అవకాశం ఉందని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం విజయ కుమారి, జ్యోతి. విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీతామహాలక్ష్మి జన్మదినం.. సేవా కార్యక్రమాలతో సార్థకం



ఖమ్మం, జూన్ 8, (జనంసాక్షి): మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ సతీమణి సీతా మహాలక్ష్మి జన్మదిన వేడుకలను సోమవారం సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు యాకన్న ఆధ్వర్యంలో ఖమ్మంలోని సాయిరాం గ్యాస్ట్రో హాస్పిటల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. సమాజ సేవే నిజమైన జన్మదిన వేడుక అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోగులకు పండ్లు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షల సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సిబ్బంది సభ్యులు పాల్గొని సేవా కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. రోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ మానవతా దృక్పథాన్ని చాటినందుకు హాజరైన వారు రామరాజు యాకన్నను అభినందించారు. జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా ఉంచి, సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



# హస్తం కండువా కప్పుకున్న 50 కుటుంబాలు

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 8 (జనంసాక్షి): దశాబ్దాలుగా మా ప్రాంతంలో జరగని అభివృద్ధి మంత్రి పొంగులేటి శీనన్న వచ్చిన తర్వాతే కళ్లముందు సాక్షాత్కరిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు ప్రాధాన్యత ఇవ్వడం, మా పొన్నేకల్ గ్రామంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' నిర్మిస్తుండటమే ఇందుకు నిదర్శనం. మా గ్రామానికి, మా ప్రాంతానికి మంత్రి పొంగులేటి ఇస్తున్న ఈ ప్రత్యేక ప్రాధాన్యతను గుర్తించే మేమంతా కాంగ్రెస్ బాట పట్టామని పార్టీలో చేరిన పలువురు నేతలు పేర్కొన్నారు. సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం వేదికగా ఖమ్మం రూరల్ మండలంలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్, సీపీఎం సహ వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమానికి, పొంగులేటి అభివృద్ధి మంత్రానికి ఆకర్షితులై పార్టీలో చేరారు. క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వీరందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పొన్నేకల్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఈ చేరికల ప్రక్రియ విజయవంతంగా సాగింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో చేరండి.. విద్యా పథకాల లబ్ధి పొందండి



మధిర, జూన్ 8 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న విద్యా పథకాల సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి కోరారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మాటూరు గ్రామంలోని కేసిఆర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ప్రభుత్వం ఉదయం అల్పాహారాన్ని కూడా అందజేస్తోందని తెలిపారు. అలాగే ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, డిజిటల్ తరగతుల ద్వారా నాణ్యమైన విద్య, బాలబాలికలకు యోగా, కరాటేలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు.పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్‌లో ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' వార్డు సభ నిర్వహణ



కల్లూరుజూన్ 08(జనం సాక్షి) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా మున్సిపాలిటీ 20వ వార్డులో కౌన్సిలర్ గుండ్ల పుల్లారావు అధ్యక్షతన వార్డు సభ జరిగింది. ఈ సందర్భంగామున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ ప్రజా సమస్యలు, వార్డు అభివృద్ధి లక్ష్యాలపై సమగ్రంగా మాట్లాడారు. ఏఎన్ఎం రజిని వర్షాకాల ముందస్తు జాగ్రత్త లపై మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, 3 వ వార్డు కౌన్సిలర్ దాసరి సుధారాణి,16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు,కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోట్రు అర్జున్ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఉస్మాన్,కల్లూరు మైనారిటీ నాయకులు షేక్ తురాబ్ అలీ, యాసా శ్రీకాంత్, శీలం కృష్ణారెడ్డి, గుండ్ల రవీంద్ర, మున్సిపాలిటీ వార్డు అధికారులు ప్రజలుతదితరులు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ అనీమియా, తలసేమియా నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం (జనంసాక్షి): జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా మరియు హైపోథలసేమియా నియంత్రణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి స్టేట్ డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్, హైదరాబాద్ డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై జిల్లాలోని డీసీహెచ్ఎస్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్లు మరియు వివిధ కార్యక్రమాల అధికారులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో సికిల్ సెల్ అనీమియా మరియు హైపో థలసేమియా కేసుల గుర్తింపు, నివారణ మరియు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు గర్భిణీ స్త్రీలు మరియు వారి భర్తలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, ఇద్దరికీ పాజిటివ్‌గా తేలినట్లయితే గర్భస్థ శిశువుకు కూడా తగిన పరీక్షలు చేయాలని తెలిపారు.అదేవిధంగా నవజాత శిశువులకు జననం జరిగిన 48 గంటల తర్వాత సికిల్ సెల్ అనీమియా మరియు హైపో థలసేమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని టీచింగ్ హాస్పిటల్స్ మరియు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే స్టాఫ్ నర్సులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి, పరీక్షల నిర్వహణ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లాలో భద్రాచలం, చర్ల ప్రాంతాల్లో కొత్త కేసుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అలాగే భద్రాచలం, పాల్వంచ, ఇల్లందు, అశ్వారావుపేట, మణుగూరు మరియు చర్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సికిల్ సెల్ అనీమియా, హైపో థలసేమియా స్క్రీనింగ్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ కార్యక్రమ పురోగతిని పర్యవేక్షించాలని, అన్ని డెలివరీ పాయింట్లలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు శిక్షణ అందించి వారి సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ రాకేష్, డాక్టర్ హరీష్, డాక్టర్ దినేష్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

